క్లుప్తంగా

షాపూర్‌నగర్ - ఈసీఐఎల్‌కు బస్సు సర్వీస్ షురూ

జీడిమెట్ల: ప్రయాణికుల రాకపోకల నిమిత్తం షాపూర్‌నగర్ నుంచి ఈసీఐఎల్‌కు బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నట్లు జీడిమెట్ల డీఎం విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటల నుంచి రాత్రి 9గంటల 25నిమిషాల వరకు ప్రతి 10నిమిషాలకు ఒక బస్సు ఉంటుందని పేర్కొన్నారు. సుచిత్ర, అల్వాల్, లోతుకుంట, లాల్‌బజార్, నేరేడ్‌మెట్, ఏఎస్‌రావు మీదుగా ఈసీఐఎల్ బస్టాప్‌కు చేరుకుంటుందన్నారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని డీఎం కోరారు.

మహిళల గౌరవానికి భంగం కలిగించొద్దు



సాక్షి,మేడ్చల్ జిల్లా: మహిళలను గౌరవించడం మన సంప్రదాయమని, వారి స్వేచ్ఛకు ఏ మాత్రం భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ మర్యాదగా ప్రవర్తించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)అభిషేక్ అగస్త్య అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పని ప్రాంతాల్లో మహిళలపై లైంగిక వేధింపులు నివారణ, నిషేదం, పరిష్కార చట్టంపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మహిళలు పని చేసే ప్రదేశంలో వారి స్వేచ్ఛ, మర్యాదలకు ఏమాత్రం భంగం వాటిల్లకుండా వారి హక్కులను పరిరక్షించడానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని ప్రతి కార్యాలయంలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీలను తప్పకుండా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి (డీడబ్ల్యూఓ) అక్కేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళా అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ గ్రామ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ముఖ్యమంత్రి కేసీఆర్ జూనియర్ గ్రామ కార్యదర్శులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర స్థానిక సంస్థల అధ్యక్షుడు, ఘట్కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టిన మేడ్చల్ జిల్లా జూనియర్ గ్రామ కార్యదర్శులకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ గ్రామ కార్యదర్శులు గత నెల 28 నుంచి డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నారన్నారు. ,అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రోడ్ల పాలు చేయటం దారుణమన్నారు. వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో 50 మందికి గ్రామ కార్యదర్శులు చనిపోయారని, వారికి ఎలాంటి భద్రత లేకపోవడం దారుణమని, చివరికి వారి అంత్యక్రియలను కూడా చందాలు వేసుకుని చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జూనియర్ గ్రామ కార్యదర్శుల పోరాటానికి బీజేపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థలకు చెందిన బీజేపీ ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మేయర్‌కు ఆహ్వానం



మేయర్ కొలన్ నీలారెడ్డిని ఆహ్వానిస్తున్న జీతేపీర్ దర్గా సభ్యులు

నిజాంపేట్: బాచుపల్లిలోని జీతేపీర్ దర్గాలో ఉర్స్ షరీఫ్‌ను ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు జరుగనున్నాయి. సోమవారం దర్గా కమిటీ సభ్యులు కార్పొరేటర్ బాలాజీ నాయక్, కో.ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీమ్ సోమవారం మేయర్ నీలారెడ్డికి ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. ఈ కమిటీ ప్రెసిడెంట్ సయ్యద్ ఫరూఖ్ అలీ, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ అక్బర్, మొహమ్మద్ అలీ, ట్రెజరర్ ఎండి ఖాజా పాషా, అడ్వైసర్ ఎండి చాంద్ పాషా, సభ్యులు సయ్యద్ ఖాజా, ఎండి హైదర్, ఎండీ సలీమ్, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు సబితా తదితరులు ఉన్నారు.

విధుల్లో నుంచి తొలగించడం దారుణం

గాంధీ ఆస్పత్రి: కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి గాంధీ ఆస్పత్రిలోని కరోనా వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులకు చికిత్స అందించిన పేషెంట్ కేర్ సిబ్బందిని విధుల్లో నుంచి తొలగించడం దారుణమంటూ సోమవారం గాంధీ ఆస్పత్రి ప్రధాన గేటు ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విధి నిర్వహణలో ఐదుమంది తోటి సిబ్బంది కూడా ప్రాణాలు కోల్పోయారని వెంటనే తొలగించిన 244 మందిని విధుల్లోకి తీసుకోకపోతే తమకు చావేగతి అని దీనికి ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వ అధికారులు బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నందిని, దివ్య, సరిత, సంధ్య, తేజ, విజయ్, కరుణాకర్, వేణు, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా మేడే



షాపూర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ, సీపీఐ, సీపీఎం నాయకులు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. సీపీఐ, సీపీఎం, బీఆర్ఎస్‌కేవీ, హెచ్‌ఎంఎస్ తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో జెండాలు ఎగురవేసి సంబరాలు జరుపుకున్నారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు, సభలు నిర్వహించి మేడే విశిష్టతను వివరించారు. జీడిమెట్లలో బీఆర్ఎస్‌కేవీ నేత ముద్దాపురం మదన్‌గౌడ్, చింతల్‌లో బీఆర్ఎస్‌కేవీ నేత చింతల నాగరాజు, షాపూర్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్, కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్ నేత ప్రతాప్‌గౌడ్ వేడుకల్లో పాల్గొన్నారు.

– కుత్బుల్లాపూర్



మేడే వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



కొంపల్లిలో జరిగిన మేడే వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నేత జెక్కి దేవేందర్



మంత్రి మల్లారెడ్డితో శ్రమశక్తి అవార్డులను ప్రదానం చేస్తున్న మదన్‌గౌడ్



జీడిమెట్ల పారిశ్రామికవాడలో బీఆర్ఎస్‌కేవీ జెండాను ఎగురవేసిన చింతల నాగరాజు



జగద్గిరిగుట్ట వాటర్‌వర్క్స్ కార్యాలయ ఆవరణలో బీఆర్ఎస్‌కేవీ జెండాను ఎగురవేస్తున్న కార్మికులు



బీఆర్ఎస్‌కేవీ జెండాను ఎగురవేస్తున్న బీఆర్ఎస్ నేత కేఎం ప్రతాప్

ప్రతి ఇంటికి తాగునీటిని అందిస్తున్నాం



తాగునీటి సరఫరాను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ కృష్ణవేణి

దుండిగల్: మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీటిని అందిస్తున్నామని దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి అన్నారు. మున్సిపాలిటీ పరిధి మల్లంపేటలోని ప్రణీత్ ప్రణవ్ లీఫ్‌లో ఇంటింటికీ తాగునీటి పైపులైన్లను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ.. మౌళిక వసతులు కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, ప్రణీత్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నరేందర్ రాజు, కాలనీ ప్రెసిడెంట్ రాజేందర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు కృష్ణ, శ్రీకాంత్, మధు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

5వ వార్డులో పర్యటించిన కౌన్సిలర్లు..

దుండిగల్ 5వ వార్డులో సోమవారం కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, జక్కుల కృష్ణాయాదవ్, మహేందర్‌యాదవ్, ఆనంద్ కుమార్, సాయియాదవ్, గోపాల్‌రెడ్డి పర్యటించారు. స్థానికంగా నూతనంగా ఏర్పాటు చేసిన రెండు బోర్లను వారు ప్రారంభించారు.

సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనుల పరిశీలన



భవానీ జీబీ ఎన్‌క్లేవ్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ రావుల శేషగిరి

సుభాష్‌నగర్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని భవానీ జీబీ ఎన్‌క్లేవ్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నామని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కాలనీ వాసులు సంధ్య, మురళీకృష్ణ, నవీన్, మధు, శ్రీకాంత్, రాజు, రఘు, లక్ష్మి, జగదీష్, చిరంజీవి, రఘు గౌడ్, తదితరులు ఉన్నారు.



ముదిరాజ్ సంఘం ఆత్మీయ కలయిక

చింతల్: చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లోని వీరాంజనేయస్వామి ఆలయంలో సోమవారం ముదిరాజ్ సంఘం ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్తుల అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలపై సంఘం సభ్యులు చర్చించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనాల్లో పెద్ద సంఖ్యలో ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వరదరాజు ముదిరాజ్, రాము, ఆంజనేయులు, జనార్దన్, రవి, చిన్న కురుమయ్య, స్వామి ముదిరాజ్, ఆదిత్య, మచ్చగిరి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం రూ.164.20 కోట్లు

- 2022-23లో రూ.152 కోట్లకుగాను, రూ.156 కోట్లు పంపిణీ
- కార్యాచరణ ఖరారు చేసిన డీఆర్‌డీఏ

సాక్షి,మేడ్చల్ జిల్లా: పొదుపు సంఘాల మహిళల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఏటా రుణాలు అందజేస్తోంది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి పథకాల ద్వారా రుణ లక్ష్యాలను నిర్దేశించి, బ్యాంకు అధికారుల సమన్వయంతో పంపిణీ చేస్తోంది. ఇందులో భాగంగానే 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం రూ. 164.20 కోట్లుగా గ్రామీణ అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) ఖరారు చేసింది. రానున్న మార్చి 31 నాటికి 2,703 స్వయం సహాయక మహిళా సంఘాలకు నిర్దేశించిన ఈ లక్ష్యాన్ని చేరుకునేలా కార్యాచరణ రూపొందించారు. ఈ మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఏపీఎం, సీసీలకు ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో క్షేత్ర స్థాయి పరిస్థితులను మించి రుణ లక్ష్యం పంపిణీలో ముందంజలో ఉంది. జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 2,852 మహిళా సంఘాలకు రూ. 152.92 కోట్ల రుణ లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ, 2,992 మహిళా సంఘాలకు రూ.156.98 కోట్లు పంపిణీ చేసి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ముందంజలో నిలిచింది.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలో వివిధ సమస్యలపై ప్రజలు 32 ఫిర్యాదులు అందించినట్లు జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)ఏనుగు నర్సింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను నిబంధనల మేరకు పరిష్కరించాలని, ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో పెట్టకూడదన్నారు. కార్యక్రమంలోడీఆర్‌ఓ లింగ్యానాయక్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయొద్దు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయకుండా నోటిఫికేషన్ ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని ఓయూ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. సోమవారం యూనివర్సిటీ లైబ్రరీ ఎదుట నిరుద్యోగ విద్యార్థి జేఏసీ చైర్మన్ భీమ్ రావునాయక్, ఈశ్వర్‌లాల్, మెడ శ్రీను ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల తర్వాత కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతో జేఎల్, డీఎల్ పోస్టుల భర్తీలో నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగాల క్రమబద్ధీకరణపై పునరాలోచన చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు.

కాంగ్రెస్ విజయానికి సమష్టిగా కృషి చేయాలి



నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ కమిటీ, అనుబంధ కమిటీల సభ్యులతో డీసీసీ అధ్యక్షుడు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సర్వసభ్య సమావేశం సోమవారం కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్, టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై నూతన కమిటీ, అనుబంధ కమిటీ సభ్యులకు నియమాక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు, కమిటీ సభ్యులు సమష్టిగా కృషి చేసి గెలిపించుకోవాలన్నారు.

ఎన్నికైన వారికి నియామక పత్రాలు

కార్పొరేషన్ అధ్యక్షుడిగా కొలన్ రాజశేఖర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా టేకుల ప్రవీణ్‌రెడ్డి, పసుపుకటి అరవింద్, ఉపాధ్యక్షులుగా ఏనుగుల మధుసూదన్‌రెడ్డి, సయ్యద్ రఫాత్, ప్రధాన కార్యదర్శులుగా రాజు, జీవన్‌రెడ్డి, ఎంఎస్ చౌదరి, కార్యదర్శిగా శ్రీశైలం, సలహాదారులుగా కొలన్ సత్తిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, నిజాంపేట్ బీసీ సెల్ చైర్మన్‌గా జీతయ్య, అధ్యక్షుడిగా శెనగల శ్రీశైలం యాదవ్, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా దాసరి మహేష్, వర్కింగ్ అధ్యక్షుడిగా జీతయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎండీ అంజద్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా కె.ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా మనీష్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షుడిగా మార్తమ్మ, ప్రధాన కార్యదర్శిగా ఎమ్.వరలక్ష్మిలకు నియామక పత్రాలను అందజేశారు.

థాయిలాండ్‌లో క్యాసినోలో పట్టుబడ్డ 'కుత్బుల్లాపూర్ వీఆర్ఏ!'



ఉప్పరి వాసు

సుభాష్‌నగర్: థాయిలాండ్‌లో క్యాసినో ఆడుతూ పట్టుబడిన 93మందిలో కుత్బుల్లాపూర్ వీఆర్ఏగా పనిచేస్తున్న ఉప్పరి వాసు ఉండటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

ఇతడు తన తండ్రి (ఉప్పరి బాలయ్య) స్థానంలో తాత్కాలికంగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గతంలో ఇతడిపై పలు ఫిర్యాదులు రావడంతో 28 జూలై 2020 కలెక్టర్ సస్పెండ్ చేశారు. సంవత్సరం తర్వాత అతని తండ్రి బాలయ్యను విధుల్లోకి తీసుకొని కొన్ని షరతులతో వాసును విధుల్లోకి తీసుకున్నారు. తాజాగా థాయిలాండ్‌లో క్యాసినో ఆడుతూ పట్టుబడ్డాడు.

శనివారమే విధుల నుంచి తొలగించాం..

ఈ విషయమై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా వాసు చెప్పాపెట్టకుండా థాయిలాండ్ వెళ్లాడని చెప్పారు. అందుకే శనివారమే అతడిని విధుల నుంచి తొలగించామని తెలిపారు. ఇక నుంచి వాసుకు కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి ఎలాంటి సంబంధం లేదని చెప్పారు.

'ప్రాణహాని ఉందని తుపాకీ తెప్పించుకున్నాడు'

- ఇద్దరినీ అరెస్టు చేసిన దుండిగల్ పోలీసులు
- ఇద్దరిపై పలు స్టేషన్లలో కేసులు



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ రామకృష్ణ

దుండిగల్: అక్రమ ఆయుధం, బుల్లెట్లు కలిగిన వ్యక్తితో పాటు అతనికి సహకరించిన మరో వ్యక్తిని దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, దుండిగల్ సీఐ రామకృష్ణ సోమవారం వివరాలు వెల్లడించారు. డి.పోచంపల్లి సర్వే నెంబరు 120 ప్రాంతానికి చెందిన మహ్మద్ ముజాహిద్ అలియాస్ ముజ్జు(51) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. కాగా ఇతను షాపూర్‌నగర్‌కు చెందిన బిహార్ టున్నా కుమార్ అలియాస్ టుండాలు స్నేహితులు. ముజాహిద్‌పై గతంలో కూకట్‌పల్లి, మాదాపూర్, దుండిగల్ పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయి. కాగా గత సంవత్సరం ఆగస్టు నెలలో వీరిద్దరు మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఓ హత్య కేసులో అరెస్టు అయ్యారు. మూడు నెలల క్రితం జైలు నుంచి విడుదలయ్యారు. తాను చేసే రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు చేసిన నేరాలకు సంబంధించి పలువురితో ప్రాణహాని ఉన్న నేపథ్యంలో తనకు గన్ సమకూర్చాలని ముజాహిద్ టున్నా కుమార్‌కు తెలిపి రూ.లక్ష అందజేశాడు. టున్నా బిహార్‌కు వెళ్లి ఒక తుపాకీతో పాటు 13 బుల్లెట్లు తీసుకువచ్చి అతనికి ఇచ్చాడు. కాగా ముజాహిద్ వద్ద పిస్టల్‌తో పాటు బుల్లెట్లు ఉన్నాయన్న విశ్వసనీయ సమాచారం మేరకు అతడితో పాటు టున్నా కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. పిస్టల్‌తో పాటు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేసేది లేదు



శ్రీహోమ్స్ కాలనీలో సమస్యలపై చర్చిస్తున్న కార్పొరేటర్

నిజాంపేట్: మెరుగైన వసతులు కల్పించే దిశగా పని చేస్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీహోమ్స్‌కాలనీలో నెలకొన్న సమస్యలపై ఆయన పాదయాత్ర నిర్వహించారు. కాలనీలోని రోడ్డు నం.2ఏలోని భాను ఎటర్నిటీ అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డు వేయాలన్నారు. వరదనీటి సమస్య తలెత్తకుండా డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ సభ్యులతో సమావేశమైన వీరేందర్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనుల విషయంలో వెనుకడుగు వేసేది లేదని, కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేయించి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. కాలనీ సభ్యులు విజయ్, శశిధర్ రెడ్డి కష్టారెడ్డి, ఫణి, సోమశేఖర్, రాజేష్, గోపాల్, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

అనుమతులు లేని నిర్మాణాలను కూల్చేస్తాం



అక్రమంగా నిర్మించిన షెడ్డును కూల్చివేస్తున్న దృశ్యం

దుండిగల్: మున్సిపాలిటీ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై దుండిగల్ మున్సిపల్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఇటీవల మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీనిపై స్పందించిన అధికారులు ఆరా తీశారు. గాగిల్లాపూర్ సర్వే నం.217లోని ప్లాట్ నంబర్ 64, 65లో నిర్మిస్తున్న సెల్లార్లు, డి.పోచంపల్లి సర్వే నం.94లో నిర్మిస్తున్న అక్రమ షెడ్డు, బహదూర్‌పల్లి సర్వే నం.110లో నిర్మిస్తున్న సెల్లార్లను సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే నిర్మాణాలకు కూల్చి వేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ టీఎస్-బీ పాస్ ద్వారా నిర్మాణాల అనుమతులు తీసుకోవాలని తెలిపారు.

దంచికొట్టింది..

భారీ వర్షంతో ఉలిక్కిపడ్డ జనం

ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని నిజాంపేట్, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, సూరారం, జగద్గిరిగుట్ట, కొంపల్లి, దుండిగల్, బాచుపల్లి, సుభాష్‌నగర్ తదితర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు రోడ్లలో భారీగా వరదనీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు రాకకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. జీహెచ్ఎంసీ మాన్‌సూన్ సిబ్బంది పలు చోట్ల డ్రెయిన్‌ల మూతలను తెరిచి వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

– కుత్బుల్లాపూర్



సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రి వద్ద చేరిన వరదనీరు



నిజాంపేట్ కార్పొరేషన్ రోడ్లపై వరద



సుభాష్‌నగర్‌లో జలమయమైన ఓ గల్లీ..



సూరారంలో కొట్టుకుపోతున్న కూరగాయలు



ఎస్ఆర్ నాయక్‌నగర్‌లో చేరిన వరదనీరు..